

వెలుగుల వెనుక
కథలు
రూ॥160/- పేజీలు:160
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


జోజిలా సొరంగం మార్గం
## తుది ఘట్టం సక్సెస్
సొరంగం చివరి 2.5 మీటర్ల భాగం పేలుడుతో ఛేదింపు



07


సంపుటి 09, సంచిక: 190 | బుధవారం | 10-06-2026 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఆర్థిక వ్యవస్థకు మహిళలు
# నాయకత్వం వహించాలి

- వారిని రుణగ్రహీతల నుంచి ఆస్తులకు యజమానుల స్థాయికి తీసుకువెళ్లేందుకు చర్యలు చేపడుతున్నాం
- సౌరశక్తి ఉత్పత్తి, పెట్రోల్ బంకుల నిర్వహణ, పారిశ్రామిక రంగాలలోనూ ముందుకు తీసుకెళ్తున్నాం
- రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల మందికి పైగా మహిళలను అక్షరాస్యత కార్యక్రమాలలో భాగస్వాములను చేశాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- మహిళా సమాఖ్యలు కొనుగోలు చేసిన 553 టిజిఎస్‌ఆర్‌టిసి బస్సులు ప్రారంభం



ప్రజాపక్షం/హైదరాబాద్

భవిష్యత్ ఆర్థిక వ్యవస్థలో మహిళలు కీలక భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. మహిళలను రుణగ్రహీతల స్థాయి నుంచి ఆస్తులకు యజమానుల స్థాయికి తీసుకువెళ్లే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. 'మహిళా శక్తి కార్యక్రమం'లో భాగంగా మండల మహిళా సమాఖ్యలు కొనుగోలు చేసిన 553 టిజిఎస్‌ఆర్‌టిసి బస్సులను సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, టిజిఎస్‌ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా ఆస్తుల యజమానులు, వ్యాపారవేత్తలు, సంపద సృష్టికర్తలు, ఆర్థిక వ్యవస్థకు నాయకత్వం వహించే స్థాయికి ఎదగాలని సూచించారు. మహిళలు సమాజంలో సగం, ఆకాశంలో సగం అని, అభివృద్ధి ఫలితాల లో కూడా వారికి సమాన భాగస్వామ్యం ఉండాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 553 మండల మహిళా సమాఖ్యలు రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 బస్సులను కొనుగోలు చేసి, టిజిఎస్‌ఆర్‌టిసికి లీజుకు ఇచ్చామని వివరించారు. ప్రతీ బస్సుకు నెలకు రూ.69,468 అద్దె లభిస్తుండగా, మొత్తం 553 బస్సుల ద్వారా మహిళా సమాఖ్యలకు నెలకు సుమారు రూ.3.84 కోట్ల ఆదాయం సమకూరుతోందని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు అద్దెల రూపంలో మహిళా సమాఖ్యలకు రూ. 20.34 కోట్లకు ఆదాయం అందిందన్నారు. ఈ బస్సులు కేవలం రవాణా వాహనాలు కావని, తెలంగాణ మహిళల ఆర్థిక స్వావలంబనకు, ఆత్మవిశ్వాసానికి, యాజమాన్య హక్కులకు ప్రతీక అని సిఎం అన్నారు. సంక్షేమం నుంచి సంపద సృష్టి వైపు మహిళలను తీసుకువెళ్లే ఆర్థిక తరువాయి 8లో



గత 12 ఏళ్లుగా
# మాటలు తప్ప మార్పు రాలేదు

- మోదీ ప్రభుత్వం 3.0 అధికారంలో రెండేళ్లు పూర్తి
- సందర్భంగా 'హామీలు వర్సెస్ వాస్తవాలు' నివేదికను విడుదల చేసిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** భారత్‌లో నరేంద్ర మోదీ ప్రభుత్వం 3.0 అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ పెద్ద పెద్ద హామీలు, ప్రకటనలు చేశారని, వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని మండిపడింది. ఈ సందర్భంగా మంగళవారం నాడు 'హామీలు వర్సెస్ వాస్తవాలు' అనే నివేదికను విడుదల చేసింది. గత 12 ఏళ్లుగా భారీ ప్రకటనలు, గొప్ప మాటలు, వార్తా ముఖ్యాంశాలతో కూడిన హామీలు ఇచ్చినప్పటికీ, వాస్తవానికి ప్రజల జీవితాల్లో ఎటువంటి సానుకూల మార్పు రాలేదని ఆ పార్టీ పేర్కొంది. ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాలు, విదేశాంగ విధానం, ఇంధనం, పర్యావరణం, వాతావరణ మార్పులు, వ్యవసాయం, ఎంఎస్ఎంఇలు, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి, సామాజిక రంగం, పౌర స్వేచ్ఛ, మైనారిటీల పాలన వంటి అంశాలపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఎఐసిసి పరిశోధనా విభాగం రూపొందించిన 75 పేజీల నివేదికను కాంగ్రెస్ నేతలు రాజీవ్ గౌడ, అమితాబ్ దూబే విడుదల చేశారు. పార్టీ సహచరుడు దూబేతో కలిసి ఏర్పాటు చేసిన తరువాయి 8లో

మహిళలపై కేంద్రానిది
## మొసలి కన్నీరు
07
మోదీ సర్కార్ అధికార మదంతో జోగుతున్నదని ఖర్గే ఆగ్రహం



# తొలకరితోనే అతలాకుతలం

- ఉరుములు మెరుపులు ఈదురుగాలులు
- హైదరాబాద్‌లో కుండపోత వర్షం
- జలమయమైన రహదారులు - స్తంభించిన ట్రాఫిక్
- విద్యుత్ తీగలు తెగిపడి ఇద్దరు యువకుల మృతి
- అత్యధికంగా బన్సీలాల్‌పేటలో 8.7సెం.మీ వర్షం

ప్రజాపక్షం/హైదరాబాద్

నగరాన్ని మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం అతలాకుతలం చేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో నగరంలోని ప్రధాన రహదారులు జలమయమై, పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే సమయానికే వర్షం కురవడంతో వేలాది మంది ఉద్యోగులు, వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైటెక్ సిటీ నుంచి కూకట్‌పల్లి, పంజాగుట్ట నుంచి సికింద్రాబాద్, ఖైరతాబాద్ నుంచి కూకట్‌పల్లి మార్గాలతో పాటు సచివాలయం, ట్యాంక్‌బండ్ హిమాయత్ నగర్, ఇందిరాపార్క్ పరిసర ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాలు నత్తనడకన సాగాయి. ట్యాంక్‌బండ్ సమీపంలో భారీ వృక్షం కూలిపోవడంతో అక్కడి నుంచి సచివాలయం తరువాయి 8లో

### వారమంతా వర్షాలే..

రాష్ట్రంలో రాగల వారం రోజుల పాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈ దురు గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బుధవారం రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు.

మీనాక్షి నటరాజన్
# నామినేషన్ తిరస్కృతి

- తెలంగాణలో క్రిమినల్ కేసుల గురించి చెప్పలేదు : బిజెపి
- అది కేసు కాదు.. ఓ ప్రైవేటు కంప్లయింట్ : మీనాక్షి



**భోపాల్:** రాజ్యసభకు మధ్యప్రదేశ్ నుండి ముగ్గురు అభ్యర్థులను ఎన్నుకునేందుకు జరుగుతున్న నామినేషన్ ప్రక్రియలో బిజెపి వేధింపులవల్ల మంగళవారం ఒక నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మీనాక్షీ నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్‌ను పరిశీలన దశలో రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ''నటరాజన్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు, తెలంగాణలో ఒక కేసుకు సంబంధించిన సమాచారాన్ని చెప్పకుండా దాచిపెట్టారన్న ప్రాతిపదికపై ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైంది'' అని ఎంపి అసెంబ్లీ అధికారి ఒకరు మంగళవారం పిటిఐ వార్తాసంస్థకు చెప్పారు. మధ్యప్రదేశ్ మందసౌర్ లోక్‌సభ నియోజకవర్గ మాజీ ఎంపి, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ తరువాయి 8లో



### మీనాక్షి నటరాజన్ సీట్ చోరీ : సిఎం

రేవంత్‌రెడ్డి మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు దారితీసిన బిజెపి కుట్రను సిఎం రేవంత్‌రెడ్డి ఖండించారు. ఓట్ చోరీ, సర్ తరువాత ఇప్పుడు సీట్ చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు.ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని, ప్రజల గొంతుకను అణచివేస్తున్నారని మండిపడ్డారు. భారత ప్రజాస్వామ్యానికి ఇది ఒక చీకటి రోజు, పౌరులందరూ దీనిని ఖండించాలని కోరారు.న్యాయం కోసం తామంతా పోరాడుతామని అన్నారు.

ఖరీఫ్, రబీ సీజన్‌లో
# 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు;

- కేంద్రం లక్ష్యం 52 లక్షల టన్నులు మాత్రమే
- రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన పూర్తి ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయాలి
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్
- రాజకీయాలు మాని బిజెపి, బిఆర్‌ఎస్ మోదీ సర్కార్‌పై వత్తిడి తేలవాలని సూచన




ప్రజాపక్షం /హైదరాబాద్

యాసంగిలో రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇందుకు బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు రాజకీయాలను మాని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంగళవారం మంత్రి వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎంపి రఘువీరారెడ్డి, ఎంఎల్‌సి శంకర్ నాయక్, ఎంఎల్‌ఎ లక్ష్మీ కాంతరావు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిలతో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సమగ్ర వ్యవసాయ విధానాలతో ప్రతి ఏటా ధాన్యం ఉత్పత్తిని పెంచుతుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రతిఏటా కొనుగోళ్ల లక్ష్యాన్ని తగ్గించుకుంటు రావడం తెలంగాణ రైతులకు అన్యాయం చేయడమేనన్నారు. తెలంగాణలో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి,తో పాటు తాను పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ఆహార శాఖను, భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) తరువాయి 12లో

బాసర వద్ద గోదావరిలో
## ముగ్గురు అన్నదమ్ముళ్లు
# గల్లంతు

ప్రజాపక్షం / నిర్మల్

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ సమీపంలో మంగళవారం ఘోర విషాదం నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చి, గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వెళ్ళిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యారు. ఈ ఘటనతో బాసర క్షేత్రానికి వచ్చిన భక్తులతో పాటు స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. స్థానికులు, తరువాయి 12లో



దుబాయిలో రోడ్డు ప్రమాదం
## ముగ్గురు జగిత్యాల జిల్లా వాసులు మృతి
03

# సోనియాతో మమతా మాటా మంతి



**న్యూఢిల్లీ :** పశ్చిమ్ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో సంక్షోభం కొనసాగుతుంది. పలువురు పార్టీ ఎంపిలు ప్రత్యేక కూటమిని ఏర్పాటు చేసి అధికార ఎన్‌డిఎతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించుకున్నారు. రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నాయకుడైన రీతబ్రత బెనర్జీ నేతృత్వంలో, తృణమూల్ పార్టీకి చెందిన 80 మంది ఎమ్మెల్యేలలో అధికశాతం మంది ఇప్పటికే ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ మంగళవారం తన 10, జనపథ్ నివాసంలో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీని కలిశారు. కూటమి భాగస్వాముల మధ్య ఐక్యత, మెరుగైన సమన్వయంపై ప్రతిపక్ష ఇండియా కూటమి సమావేశం ఉద్ఘాటించిన మరుసటి రోజు మమత భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలి బెంగాల్ ఎన్నికల్లో బిజెపి చేతిలో ఓటమి పాలైన తర్వాత తృణమూల్ సభ్యులు పార్టీని వీడుతున్న నేపథ్యంలో, ప్రతిపక్ష కూటమి సమావేశం అనంతరం ఇరు పార్టీల తరువాయి 12లో

# రెండు మూడు రోజుల్లో తెరుచుకోనున్న హోర్ముజ్



- శక్తిమంతమైన ఒప్పందంపై త్వరలో సంతకాలు
- రెండు వారాల్లో ఇరాన్‌పై పూర్తి విజయాన్ని ప్రకటిస్తాం
- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో యుద్ధ విరమణ ఒప్పందం తుది ఘట్టానికి చేరుకుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రెండు మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధి తెరచుకుంటుందని ఘంటాపథంగా చెప్పారు. శుక్రవారంనాటికి ఇరాన్‌తో అత్యంత శక్తిమంతమైన (పవర్‌ఫుల్ డీల్) అమెరికాకు అనుకూలమైన ఒప్పందం కుదురుతుందని, రెండు రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని అన్నారు. రాబోయే రెండు వారాలలో ఇరాన్‌పై పూర్తిస్థాయి విజయాన్ని అమెరికా ప్రకటిస్తుందని చెప్పారు. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య పరస్పర దాడులు జరిగినప్పటికీ మరోవైపు ఒప్పందంపై సంప్రదింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. కాగా అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్‌తో చర్చల్లో లక్ష్యాలు సాధించడంలో అమెరికా బలమైనస్థానంలో ఉందని చెప్పారు. ''పశ్చిమాసియాలో యుద్ధ దాడులు (ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య) కొనసాగినప్పటికీ, యుద్ధాన్ని ముగించే ఒప్పందం రెండు మూడు రోజుల్లో కుదురుతుంది'' అని ట్రంప్ మంగళవారం తరువాయి 8లో

మైనర్‌పై లైంగిక దాడి
# హత్యాయత్నం

- నాలుగు అంతస్తుల భవనంపై నుంచి కిందకు తోసేసిన కామాంధుడు
- ఖమ్మంలో దారుణ ఘటన
- నిందితున్ని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాపక్షం/ ఖమ్మం

ఖమ్మంలో దారుణ ఘటన చోటు చేసుకోగా బాధితురాలు అపస్మారక స్థితిలో ఉండడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఓ కామాంధుడు మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడటమే గాక ఆమెను అంతం చేసే క్రమంలో నాలుగు అంతస్తుల భవనంపై నుంచి కిందకు నెట్టాడు. ఈ దారుణ ఘటన ఖమ్మం నగరంలోని రాపర్తి నగర్‌లో ఈనెల ఆరున జరిగింది. వివరాల్లోకి వెళితే... ఖమ్మం రూరల్ మండలంకు చెందిన మైనర్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తోంది. వేసవి సెలవులు కావడంతో ఖమ్మం రాపర్తి నగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న తాతయ్య, అమ్మమ్మల వద్దకు వచ్చింది. వచ్చిన దగ్గర నుంచి ఏదో ఒక రకంగా మహ్మద్ గౌస్‌పాషా అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. గౌస్‌పాషా అదే భవనంలో రెండవ అంతస్తులో నివసిస్తున్నాడు. ఈనెల ఆరున మైనర్‌ను భవనంపైకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అక్కడి నుంచి కిందకు నెట్టి వేయడంతో బాలిక తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను తొలుత ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం మమత జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సోమవారం సాయంత్రం ఆమె స్పృహలోకి వచ్చి జరిగిన దారుణ తరువాయి 12లో